


పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,382, క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,54,430 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,47,213 క్యూసెక్కులు వదులుతున్నారు. 35.4158 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు వేకువజాము 3 గంటల నుంచే దర్శనం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఈఓ శీనానాయక్ తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల: జిల్లాలోని ఎస్టీల సమస్యలపై ప్రతి నెలలో నాలుగో శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.అందులో భాగంగా ఉదయం 10.30గంటల నుంచి కలెక్టరేట్ సముదాయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్టీలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఏఎంఆర్ కంటైనర్ ధ్వంసం



బల్లికురవ: గ్రానైట్, మెటల్, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన ఏఎంఆర్ కంటైనర్ అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం పగులగొట్టి ధ్వంసం చేశారు. అక్టోబర్ 1 నుంచి అక్రమ రవాణాకు అడ్డుకట్టతో సీనరేజ్ వసూలు బాధ్యతలను ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు కట్టబెట్టింది. ఇందుకోసం ఆ సంస్థ నెలకు రూ.47 కోట్లు రాయల్టీ రూపంలో చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి మండలాల లోని ప్రధాన గ్రామాల్లో కంటైనర్లను తెచ్చి ఇప్పటికే అమర్చారు. అక్రమ రవాణాతో కోట్ల రూపాయలు వెనకేసుకున్న వారంతా కంటైనర్ల ఏర్పాటుతో హడలెత్తుతున్నారు. ధర్మవరం కొండ సమీపంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను ధ్వంసం చేశారు.

జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన పెంచాలి



బాపట్ల: జీఎస్టీ రేట్ల తగ్గింపుపై వ్యాపారస్తులు ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించాలని తూనికలు కొలతల శాఖ రీజినల్ ఆఫీసర్ ఐజాక్ పేర్కొన్నారు. బాపట్ల రిటైల్ కిరణా అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో గురువారం వ్యాపారస్తులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0లో భాగంగా మార్పులు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో బాపట్ల జిల్లా అధికారి లిల్లీ, ఇన్‌స్పెక్టర్ రామదాసు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు



బాపట్ల టౌన్: భారీ వర్షసూచన నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనటానికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఏదైనా సహాయం అవసరమైతే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 112 (లేదా) 8333813228కి ఫోన్ చేయాలని సూచించారు. ఇప్పటికే 26 పునరావాస కేంద్రాలను కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల్లో ఏర్పాటు చేశారని వెల్లడించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు వాటిల్లో రక్షణ పొందాలని ఆయన సూచించారు.

రిటర్నబుల్ ప్లాట్లకు నేడు 'ఈ - లాటరీ'

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ పరిధిలో భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం (ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపునకు ఈ - లాటరీ నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటరులోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా కేటాయిస్తామని వెల్లడించారు. వీటిలో 43 రెసిడెన్షియల్, 41 కమర్షియల్, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నట్లు వివరించారు. ఈ- లాటరీ కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.



హాజరైన ఉపాధ్యాయులు



రణభేరి మోగిస్తున్న యూటీఎఫ్, జేఏసీ నాయకులు



హాజరైన ఉపాధ్యాయులు

రణభేరి

కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి 'రణభేరి' మోగించారు. కూటమి ప్రభుత్వ కుయుక్తులను, మోసాన్ని ఎండగట్టారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిర ప్రాంగణంలో రాష్ట్రస్థాయి 'రణభేరి' బహిరంగ సభ నిర్వహించారు. నాలుగు విడతల డీఏలతో పాటు పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద దాచుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ డబ్బులు అడిగితే అంక్షలు పెడుతున్నారంటూ మండిపడ్డారు.ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అక్టోబర్‌లో జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

- గుంటూరు ఎడ్యుకేషన్ / సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఓం శాంతి.. శాంతి !

- కృష్ణమ్మలో వరద నీరు తగ్గుముఖం
- పెసర్లంక అరవింద వారధి వద్ద రెండు అడుగులు తగ్గిన నీరు
- తీర ప్రాంత వాసులకు ఊరట
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- లోతట్టు ప్రాంతాలను వీడని వరద నీరు



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో తగ్గిన వరద నీటి మట్టం

కొల్లూరు : కృష్ణమ్మ ఎట్టకేలకు శాంతించింది. నదిలో నీటి మట్టం తగ్గింది. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి ఉధృతంగా వస్తున్న వరద నీటిని సముద్రంలోకి విడుదల చేసిన నేపథ్యంలో మూడు రోజులుగా లంక గ్రామాలు ప్రజలు భయంతో వణికిపోయారు. కంటి మీద కునుకు కరువైంది. అందుకు తగ్గట్లు బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతికారు. వరద తీవ్రత పెరిగితే కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సాగులో ఉన్న వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లేది. గ్రామాలు కూడా ముంపు బారిన పడతాయన్న ఆందోళనతో వరద ప్రభావిత గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

మునకలో పల్లపు ప్రాంతాలు

నదిలో వరద ప్రవాహం తగ్గడంతోపాటు తీర ప్రాంత రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే, నది గట్లకు ఏర్పడిన గండ్లు, సహజ సిద్ధంగా ఉన్న నక్కపాయ గండి, గాజుల్లంక చినరేవు నుంచి పల్లపు ప్రాంతాలకు చేరిన నీరు బయటకు పోలేదు. పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాలను వరద నీరు ఇంకా చుట్టుముట్టి ఉంది. మండలంలోని దోనేపూడి చినరేవు చప్టాపై వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. పది గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

తప్పిన ముంపు గండం

భట్టిప్రోలు: కృష్ణమ్మ శాంతించడంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వరద వెనుకకు మళ్లడంతో గండం నుంచి గట్టెక్కారు. లోతట్టు, మధ్యస్థ ప్రాంతాల్లోని పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకులడొంక వద్ద వరద నీరు వెనుకకు మళ్లింది. ఓలేరు, కోళ్లపాలెం, పెదపులివర్రు చప్టాలపై వరద నీరు కొంతమేర తగ్గింది.

ఏడు వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు

భట్టిప్రోలు, కొల్లూరు మండలల్లోని లంక గ్రామాల్లోని ఏడు వేల ఎకరాల్లో రైతులు అరటి, పసుపు, కంద, తమలపాకు, మొక్కజొన్న, మల్బరీ, కొబ్బరి, జామ, మామిడి, మునగ, బొప్పాయి, కూరగాయలు, ఆకుకూరలు పండించారు. గతంలో కృష్ణానదికి వచ్చిన వరదలతో పంటలు ముంపు బారిన పడి, ఎందుకు పనికి రాకుండా పోయాయి. కూరగాయలు, పూల తోటలు నుంచి ఆదాయం లభించినప్పటికీ, దీర్ఘకాలిక పంటలు ముంపులో చిక్కుకుని దెబ్బతింటున్నాయి. వరుసగా వరదలు రావడంతో రేవుని ఆనుకుని ఉన్న భూములు పటిష్టతను కోల్పోయి కోతకు గురవుతున్నాయి. పల్లెపాలెంలోని రేవు అంచున నివాస గృహాలు కూడా కోతకు గురవుతున్నాయి.



భట్టిప్రోలు మండలం పెదలంక కాకులడొంక వద్ద నిలిచిన వరద నీరు

గంట గంటకూ తగ్గుముఖం

గురువారం నుంచి ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం తగ్గుతూ రావడంతో నదిలో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. బుధవారం రాత్రి 4.44 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. గురువారం గంట గంటకు నీటి విడుదల తగ్గుముఖం పడుతూ రాత్రికి 3.28 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. ఒక్కరోజులోనే 1.16 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల తగ్గడంతో ఆర్‌సీ అధికారులు ప్రకాశం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

బాపట్ల: స్వచ్ఛతా హీ సేవల్లో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. 461 గ్రామాల్లో మురికి కూపాలుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని ఆదేశించారు. జిల్లాకు 342 సామాజిక మరుగుదొడ్లు మంజూరు కాగా, నేటి వరకు 223 మొదలు పెట్టకపోవడం ఏమిటని ఆరా తీశారు. ముఖ్యంగా పురపాలక సంఘాలలోని ప్రధాన కాల్వలన్నిటిలో పూడికతీత పనులు చేపట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని తాగునీటి చెరువులని క్లోరినేషన్ చేయాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ వారంలో మూడు రోజులు సంబంధిత గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, డీపీఓ ప్రభాకర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పాల్గొన్నారు.

అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ నిషేధం

చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు



చీరాల టౌన్: పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చీరాల మున్సిపాలిటీలో అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నుంచి పూర్తిగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు ప్రకటించారు. గురువారం తన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, చీరాల తహసీల్దార్ సమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుంచి మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పాటుగా కవర్లు వినియోగం, అమ్మకం, నిల్వలు, తయారీ, పంపిణీలను పూర్తిగా నిషేధిస్తున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడకం, అమ్మకాలు, పంపిణీ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులంతా ఆదేశాలను తప్పక పాటించాలని ఆయన ఆదేశించారు.

గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

చీరాల మున్సిపాలిటీలో గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యజమానులు వాటిని పబ్లిక్ స్థలాల్లో వదలకూడదని చెప్పారు. గోవుల సమస్యలను పరిష్కరించేందుకు వాటికి పునరావాసంతో పాటు గుర్తింపు కూడా చేస్తున్నామని వివరించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో గోవులను సంరక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

సమర్థంగా ప్రభుత్వ పథకాల అమలు

అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశం

బాపట్ల: జిల్లాలో సూపర్ సిక్స్ పథకాలను సమర్థంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పథకాల అమలుపై ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలను పారదర్శకంగా ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేయాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకాలను అర్హులందరికీ అందజేయాలని చెప్పారు. జిల్లాలో స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, డిపోల్లో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా మరుగుదొడ్లు నిర్మించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆ శాఖ అధికారులకు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిగా, సుచిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని హాస్టళ్లలో మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆయన చెప్పారు. సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లవన్న, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం పాల్గొన్నారు.



చీరాల పట్టణంలో రోడ్లను శుభ్రం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం

చీరాల అర్బన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం చీరాల పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు కలెక్టర్ అధికారులతో కలిసి చీపురు చేతపట్టి, రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారు స్వయంగా చీపుర్లు చేత పట్టాలన్నారు. పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా పరిశుభ్రత ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియచెప్పే ప్రయత్నం చేయాలని తెలిపారు. రోడ్లుపై చెత్తను నిల్వ ఉంచకుండా షాపుల నిర్వాహకులు కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చెత్త పేరుకుపోవడం వల్ల నీరు నిలిచి దోమల వ్యాప్తి చెంది, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. స్వచ్ఛ బాపట్ల.. స్వచ్ఛ చీరాలలో అందరూ భాగస్వాములు కావాలని చెప్పారు. బాపట్ల జిల్లాలో త్వరలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించనున్నామని వెల్లడించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, ప్రజలు కూడా వినియోగాన్ని తగ్గించి వస్త్రాలతో తయారు చేసిన సంచులను వాడాలని ఆయన సూచించారు. చీరాల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, వినియోగిస్తే జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ ఎం. సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా పంపిణీ

బాపట్ల: జిల్లాలోని రైతులందరికీ వారి అవసరాల మేరకు యూరియాను వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేస్తున్నారని కలెక్టర్ వి.వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని 26 రైతు భరోసా కేంద్రాలు, పరపతి సంఘాల ద్వారా 318 మెట్రిక్ టన్నుల యూరియాను 3,452 మంది రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా 112 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని కలెక్టర్ తెలిపారు.



బాపట్ల రాజీవ్‌గాంధీ కాలనీలో శ్రీ కాత్యాయని దేవిగా..



అన్నపూర్ణాదేవిగా జిల్లెళ్లమూడి అమ్మ



పెదపులిపర్రులో ప్రత్యేక అలంకరణలో గోగులాంబ అమ్మవారు

భక్తుల పాలిట కల్పవల్లి కాత్యాయని దేవి

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్యుత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం పలు ఆలయాల్లో కాత్యాయని దేవిగా అమ్మవారు దర్శనమించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాత్యాయని దేవిని పూజిస్తే చదుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయని, రోగాల భయాలు నశిస్తాయని, ఆయురారోగ్యాలు, సుఖఃసంతోషాలు వర్ధిల్లుతాయని భక్తుల నమ్మకం.

– సాక్షి, నెట్‌వర్క్



చందోలులో నృసింహ, వారాహి అవతారంలో బగళాముఖి అమ్మవారు

వర్ష విపత్తి దాటండిలా..!

- భారీ వర్షాల నేపథ్యంలో పత్తి సాగులో తెగుళ్ల నివారణ
- లాంఫాం వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

గుంటూరు రూరల్: అధిక వర్షపాతం నెలకొన్న నేపథ్యంలో పత్తి పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్ల నివారణ చేపట్టి పంటలను కాపాడుకోవాలని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ ఎన్వీవీఎస్ దుర్గాప్రసాద్, తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మనోజ్‌కుమార్, పత్తి విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజమణిలు తెలిపారు. వారు సూచించిన సస్యరక్షణ చర్యలు..

- ఈ నెలలో ఇప్పటికే 253.2 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు జిల్లాలలో సాగులో ఉన్న పత్తిలో ముందస్తు తెగుళ్ల నివారణ అవసరం. అధిక వర్షం కారణంగా పెరిగిన గాలిలో తేమ వల్ల పత్తిలో కోరినోస్పోరా ఆకు మచ్చ, ఆల్టర్నేరియా ఆకు మచ్చల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక ఎకరాకు 600 గ్రాములు 7–10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలన్నారు.


ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు

- బాక్టీరియా ఎండు తెగులు లక్షణాలైన కోణాకారపు ఆకు మచ్చలు, ఆకు ఈనెలు, ఆకు తొడిమల కణజాల మరణం, కాయ కుళ్లు గమనించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా ప్రాపికోనజోల్ 1 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి లేదా హెక్సకోనజోల్ 1గ్రాము లీటరు నీటికి లేదా కార్బెండజిమ్ + థీరాం 3గ్రాములు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలన్నారు.
- నీటి నిల్వ, పారుదల వల్ల భూమి ద్వారా సంక్రమించే తెగులు వేరు కుళ్లు.. ఇదివేరు కణ జాలాలను నాశనం చేసి మొక్కల సాంద్రతను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. వేరు కుళ్ల నివారణకు తెగులు ఆశించిన మొక్కల మొదలులో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలన్నారు.


కాయకుళ్లు తెగులు

- శిలీంధ్ర సమ్మేళనం ద్వారా సంక్రమించే కాయ కుళ్లు తెగులు అధిక వర్షం వల్ల కలుగుతుందని దీని ద్వారా పత్తి కాయలు కుళ్లి, దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక ఎకరాకు 600 గ్రాములు 7–10 రోజుల వ్యవధి లో 2–3 సార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

తొమ్మిది మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు తొమ్మిది మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. అత్యధికంగా కొల్లిపర మండలంలో 25.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా చేబ్రోలు మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటున 5.5 మి.మీ.నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి మండలంలో 15.4 మి.మీ., దుగ్గిరాల 14.8, తుళ్లూరు 14.2, తాడేపల్లి 11.2, పెదకాకాని 10.2, తాడికొండ 4.6, తెనాలి మండలంలో 3 మి.మీ. చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 25వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 132.8 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 253 మి.మీ. నమోదైంది.

రేపు మాచర్లలో జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్.కే.బి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు సుమారు పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని వెల్లడించారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.15వేల నుంచి రూ.35వేల వరకు జీతం ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీ.టెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటాతోపాటు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

'డీఈఓ పూల్' ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 నియామకాల కంటే ముందుగానే డీఈఓ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు పేర్కొన్నారు. గురువారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1236 మంది డీఈఓ పూల్‌లో ఉన్నారని, 2016లో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నిలకడగా ఏ ఒక్క పాఠశాలలో పనిచేయలేక పోయారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 50 మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరికి ఉద్యోగోన్నతి కల్పించకుండా డీఎస్సీ నియామకాలు ద్వారా కేడర్‌లో జూనియర్లుగా మిగిలిపోతారన్నారు. న్యాయపరమైన అంశాలతో వీరికి ఉద్యోగోన్నతులు అడ్డుకోవడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ అర్హత గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పీఈటీ ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగిందని తెలిపారు. డీఎస్సీ మాదిరిగానే జూనియర్ కాలేజీ, డైట్‌లలో నియామకాలు చేపట్టాలని కోరారు. ప్లస్ 2 పాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు సబ్జెక్ట్ టీచర్స్ కొరతతో ఇబ్బంది పడుతున్నారని, ఖాళీలను అర్హత గల స్కూల్ అసిస్టెంట్స్‌తో భర్తీ చేసి విద్యా ప్రమాణాలు కాపాడలన్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ దసరా పండుగకు పెండింగ్ నాలుగు డీఏ లలో ఒక్క డీఏ అైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు గత 15 నెలల నుంచి ఒక్క బకాయి విడుదల కాలేదన్నారు. సమావేశంలో జిల్లా శాఖ నాయకులు పి.లక్ష్మినారాయణ, జి.దాస్,ముని నాయక్, టి.రామారావు, పి.వేణుగోపాలరావు, కిరణ్, శివరామకృష్ణ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బసవ లింగారావు

గతాన్ని మరిచిన బాలకృష్ణ

మాజీ ఎంపీ నందిగం సురేష్

తాడికొండ: మెంటల్ సర్టిఫికెట్‌తో హత్యకేసు నుంచి బయటపడిన బాలకృష్ణ గతాన్ని మరిచి మాట్లాడటం దుర్మార్గమని, ఆయన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని మాజీ ఎంపీ నందిగం సురేష్ అన్నారు. బెల్లంకొండ సురేష్‌పై బాలకృష్ణ ఎందుకు కాల్పులు జరపాల్సి వచ్చిందో ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి లేకపోతే నీ గతి ఏమై ఉండేదో ఆలోచించుకోవాలని, అప్పుడే నువ్వు జైలు పాలు అయ్యేవాడివనే గతాన్ని గుర్తుంచుకొని మాట్లాడితే మంచిదన్నారు. అప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాళ్లు పట్టుకొనే నువ్వు కేసు నుంచి తప్పించుకున్నావని గుర్తుంచుకొని మాట్లాడితే మంచిదని, కక్షపూరిత రాజకీయాలు, అబద్ధపు హామీలు, మాటలు వైఎస్సార్ కుటుంబానికి లేవు, రావనే నిజం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని బాలకృష్ణ తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. గతాన్ని మర్చిపోయి బాలకృష్ణ ప్రవర్తించిన తీరుపై సినీనటుడు చిరంజీవి సైతం హుందాగా స్పందించారని, ప్రజా ప్రతినిధిగా ఉన్న బాలకృష్ణ తన వ్యాఖ్యలను ఉప సంహరించుకొని క్షమాపణ చెపితే మంచిదని లేదంటే నీకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మెంటల్ సర్టిఫికెట్ ఉన్న వ్యక్తులు అసెంబ్లీకి అనర్హులని, బాలకృష్ణ ముందు ఆ సంగతి తేల్చుకొని చట్టసభల్లో మాట్లాడాలని హెచ్చరించారు.



మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	30,729
అమ్మకాలు	32,470
నిల్వ	8,696



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,200
నంబరు-5	10,000–14,000
273	10,500–13,500
341	10,000–15,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,400
నంబరు-5	10,000–14,200
341	10,000–15,200
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 14,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,000
తాలుకాయలు	6,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,700
బాడిగ - 355	10,000–14,900
దేవనూరు డీలక్స్	10,500–14,200
తాలు	5,200 - 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

ఖాతాదారులకు బురిడీ

- ఈఎంఐలు చెల్లించినా ఇవ్వని రసీదులు
- సంస్థ చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం
- పోలీసులను ఆశ్రయించిన ఖాతాదారులు

బాపట్ల టౌన్: బాపట్ల పట్టణంలోని ఏజీ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంఎఫ్‌ఎల్ (హిందూస్థాన్ మైక్రోఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్) పరిధిలో బాపట్ల జిల్లాలోని సుమారు 350 మందికిపైగా ఖాతాదారులు వివిధ రూపాలలో రూ. కోట్లలో రుణాలు తీసుకున్నట్లు సమాచారం. విడతలవారీగా ఈఎంఐలు చెల్లించినప్పటికీ అవి సంస్థ ఖాతాలో జమ చేయటం లేదనే ఆరోపణలు వచ్చాయి. ఖాతాదారులు వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరిగి తమ అకౌంట్‌లకు సంబంధించిన స్టేట్‌మెంట్‌లు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో తిరుగు పయనమవుతున్నారు.

ఉన్నతాధికారులను కలిసినా ఫలితం శూన్యం

ఈఎంఐలు చెల్లించినప్పటికీ తమ అప్పు యథావిధిగా ఉందనే విషయం తెలుసుకున్న ఖాతాదారులు సదరు మేనేజర్ తీరుపై విజయవాడ రీజినల్ మేనేజరు షేక్ సైదులుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆడిటర్ సమక్షంలో బాపట్ల బ్రాంచ్‌ను సందర్శించి సదరు మేనేజర్ తీరుపై ఆయన విచారించారు. వారి విచారణలో ఈ ఏడాది ఆగస్టు 31న జమ చేయాల్సిన రూ. 5,06,384, సెప్టెంబర్ 20లోపు జమ చేయాల్సిన రూ. 5,22,212లు జమ చేయలేదని తేలినట్లు సమాచారం.


బాపట్ల పట్టణంలోని సంస్థ కార్యాలయం

రూ.2.23 లక్షలు చెల్లించినా రూ.40,400కే రసీదులు

కర్లపాలెం మండలంలోని గణపవరం పంచాయతీ కేసరపూడి కాలనీకి చెందిన తాడిశెట్టి లక్ష్మితిరుపతమ్మ గ్రామంలో రేకుల ఇల్లు నిర్మించుకున్నారు. అప్పట్లో రూ. 7 లక్షల అప్పు అయ్యింది. దానిని తీర్చేందుకు ఇంటిని హెచ్‌ఎంఎఫ్‌ఎల్‌లో తనఖా పెట్టి రూ. 7.50 లక్షల రుణం తీసుకున్నారు. నెలకు రూ. 20,200 చొప్పున చెల్లించారు. ఇప్పటివరకు 11 నెలలకు రూ. 2.23 లక్షలు చెల్లించినా కేవలం రూ. 40,400 చెల్లించినట్లు రసీదులు ఇచ్చారని ఆమె వాపోయారు. ఇదేమని సిబ్బంది రామకృష్ణ, నూరేళ్ళను అడిగితే తమ మేనేజర్ రాజశేఖర్ జమ చేయడం లేదని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. మేనేజర్‌తో మాట్లాడే ప్రయత్నం చేస్తే అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. గురువారం మేనేజర్‌పై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

చినగంజాం: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో వంద మంది తెలుగు మహనీయుల విగ్రహాలతో హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహా నిర్మాణం చేయాలని ఊరూర జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమంలో భాగంగా కడవకుదురులో నవ్యాంధ్ర సాంస్కృతిక కళాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు విజ్ఞప్తులపై స్థానిక ప్రజా చైతన్య కళావేదిక సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి ఇనేళ్లయినా సరైన అభివృద్ధి జరగలేదన్నారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్టణం, తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆహ్వాన కమిటీలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసే ఐదు విజ్ఞప్తులపై కార్యక్రమంలో వివరించారు. ఆరిగ వెంకట్రావు, కాళిదాస్, పల్లపోలు నాగ మనోహర లోహియా, సుంకర కోటేశ్వరరావు, వారు ముసలారెడ్డి, దైవాల తిరుపతిరెడ్డి, ఎం. గోపాల్, ఏడుకొండలు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కోట వెంకటేశ్వరరెడ్డి

గుంటూరులో 21 వాటర్ ప్లాంట్లు సీజ్

నెహ్రూనగర్: నగరంలో కలుషిత తాగు నీటిని సరఫరా చేస్తూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్న 21 మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రజారోగ్యం దృష్ట్యా వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు సీజ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. నగరంలో కొన్ని ప్రాంతాలలో కలుషిత తాగు నీటి వలన డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో ఉన్న 120 మినరల్ వాటర్ ప్లాంట్లు సరఫరా చేసే తాగు నీటి శాంపిల్స్‌ను మంగళగిరిలోని ఐపీఎం పీహెచ్ ల్యాబ్, గుంటూరు మెడికల్ కాలేజీ ఆవరణలోని రీజినల్ పీహెచ్ ల్యాబరేటరీలో పరీక్షించగా అందులో 21 ప్లాంట్ల నుంచి విక్రయించే నీటిలో హానికారక బ్యాక్టీరియాను గుర్తించడం జరిగిందన్నారు. సదరు ల్యాబ్ రిపోర్టులను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపామని, ప్రభుత్వం తక్షణమే ప్రజారోగ్యానికి భంగం కలిగించే హానికారిక బ్యాక్టీరియాలను కలిగియున్న నీటిని విక్రయిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను వెంటనే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిందన్నారు.

సీజ్ చేసిన ప్లాంట్లు ఇవీ..

నగరంలోని ఐపీడీ కాలనీలోని పెరల్స్ ఎంటర్‌ప్రైజెస్, నల్లచెరువులోని నీల్ డ్రాప్, శ్రీనివాసరావుతోట 60 అడుగుల రోడ్డులోని మై ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్, చరణ్ వాటర్ ప్లాంట్, రెడ్ల బజార్‌లోని కేపీ రావు ప్లాంట్, అంబేడ్కర్ నగర్‌లోని జేఎస్ వాటర్ ప్లాంట్, పాత గుంటూరు బాలాజీనగర్‌లోని ఏకా వారి వీధి వాటర్ ప్లాంట్, మల్లికార్జునపేటలోని గురుశ్రీ మినరల్ వాటర్ ప్లాంట్, ఏటీ అగ్రహారంలోని బాషా కూల్‌డ్రింక్, శివనగారాజు కాలనీలోని వాసవి వాటర్ ప్లాంట్, నెహ్రూనగర్‌లోని ఆర్కే వాటర్ ప్లాంట్, నగరాలలోని స్వాతి ఫుడ్ అండ్ వాటర్ ప్లాంట్, స్తంభాలగరువులోని ఎలైన్ ఫ్రెష్ వాటర్, మద్దిరాల కాలనీలోని పరమేష్ హోల్ సేల్, సంపత్ నగర్‌లోని నరేష్ షాప్, కోబాల్ట్ పేటలోని ఉమర్ బాషా ఫ్లేవర్డ్ వాటర్, పలకలూరులోని ఎన్‌టీఆర్ సుజల ప్లాంట్, హిమని నగర్‌లోని సరస్వతి కృష్ణ స్టోర్, బుడంపాడులోని స్టెయిన్ లెస్ స్టీల్ స్టోరేజ్ ట్యాంక్, ఏటుకూరులోని మేఘన షాప్, లాలుపురం రోడ్డులోని 76వ సచివాలయం దగ్గరలోని ప్లాంట్లను నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు సీజ్ చేశారు.


నగరంలోని ఓ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసిన ప్రజారోగ్యాధికారులు



'పాషాణ' కూటమి.. రోగులకేమైతే ఏమి?

పేదల పెద్దాసుపత్రిగా పిలుచుకునే గుంటూరు జీజీహెచ్‌లో సామాన్యుల గోడు వినే నాథుడే కరువయ్యాడు. ఇటీవల నగరంలో అతిసార, కలరా వంటి వ్యాధులు విజృంభించి పదుల సంఖ్యలో పేదలు వైద్యం కోసం వచ్చి అల్లాడుతున్నారు. కనీస సౌకర్యాలు లేక విలవిల్లాడుతున్నారు. కనీసం రోగులను తరలించేందుకు స్ట్రెచ్చర్ లేక ఇద్దరు ముగ్గురు రోగిని పట్టుకుని ఆపసోపాలు పడుతూ లోపలికి తరలిస్తుంటే.. సిబ్బంది మాత్రం స్ట్రెచ్చర్లపై తాపీగా భవన శిథిలాల తరలింపు చేపట్టారు. రోగులను తరలించేందుకు స్ట్రెచ్చర్లు ఉండవుగానీ వ్యర్థాల తరలింపునకు మాత్రం యథేచ్ఛగా వాడేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నగరాన్ని రోగాలు చుట్టుముట్టి.. వసతులు లేక రోగులు అవస్థలు పడుతున్న తరుణంలో పాషాణ కూటమి ప్రభుత్వ తీరుకు నిదర్శనంగా ఈ చిత్రం నిలుస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

లిఫ్టులో ఇరుక్కున్న ప్రయాణికులు


నడికుడి రైల్వేస్టేషన్‌లో నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

- నడికుడి రైల్వే జంక్షన్‌లో ఘటన
- నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

దాచేపల్లి: నడికుడి రైల్వే జంక్షన్‌లో ఉన్న లిఫ్ట్‌లో ప్రయాణికులు గురువారం ఇరుక్కుపోయారు. నడికుడి రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు వెళ్లేందుకు ప్రయాణికులు నడికుడి రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం నుంచి రెండో నెంబర్ ప్లాట్ ఫారం పైకి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ ఎక్కి కిందకు దిగుతుండగా ఆకస్మాత్తుగా లిఫ్టు మధ్యలో ఆగిపోయింది. దీంతో లిఫ్ట్‌లో ప్రయాణికులు ఇరుక్కుపోయి తీవ్ర భయాందోళన చెందారు. ఈ విషయం అక్కడ ఉన్న తోటి ప్రయాణికులు గమనించి రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు స్టేషన్‌లోకి వచ్చి ఆగింది. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ప్రయాణికులు ఈ రైలులోనే వెళ్లాల్సి ఉంది. రైల్వే సిబ్బంది అతి కష్టం మీద లిఫ్ట్ ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీశారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన వీరిని బయటకు తీసేంతవరకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుని స్టేషన్‌లోనే ఆపేశారు. సుమారు పది నిమిషాలపాటు రైలు ఆగింది. తర్వాత లిఫ్ట్‌లో ఇరుక్కున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి వెళ్లారు. ఇటీవల కాలంలో నడికుడిలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు తరచూ ఆగిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చేస్తున్నారు.


లిఫ్ట్‌లో ఇరుక్కున్న ప్రయాణికులను బయటకు తీస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంలో రైతులు భాగస్వాములు కావాలి

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయంలో ప్రతి ఒక్క రైతు భాగస్వామి కావాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. బృందావనంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఉద్యమంలా ముందుకు వెళ్తుందని తెలిపారు. 2025–26 సంవత్సరంలో జిల్లాలో 82,619 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. రైతులు రసాయనాలు విడిచి కషాయాలు వాడటం వలన భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పంట ఉత్పత్తులు ఆరోగ్యకరంగా ఉండటంతోపాటు రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు.


మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

ఎన్‌ఎంఎంఎస్ నమోదుకు 30 తుది గడువు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసేందుకు ఈనెల 30వ తేది వరకు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహిస్తారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలని తెలిపారు. వివరాలకు డీఈఓ కార్యాలయంలో పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని సూచించారు.

నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న డాక్టర్ జున్ను మాస్టర్

- చేతిరాతలో ఉచిత శిక్షణ అందిస్తున్నందుకు గుర్తింపు
- ఒకే నెల జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు మూడు అవార్డులు



యడ్లపాడు: విద్యార్థులకు చేతిరాతలో ఉచిత శిక్షణ ఇస్తూ తనదైన శైలిలో గుర్తింపు పొందిన కొండవీడు జెడ్పీ హైస్కూల్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు డాక్టర్ షేక్ జున్నుసాహెబ్‌కు మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో బిర్లా ప్లానెటోరియం వద్ద ఉన్న భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు–2025ను ప్రదానం చేశారు.

ఒకే నెలలో మూడు అవార్డులు

విద్యారంగానికి జున్ను సాహెబ్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ నెలలో ఇది మూడో అవార్డు రావడం విశేషం. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఏపీ రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈనెల 7న విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నుంచి గురుబ్రహ్మ రాష్ట్రస్థాయి అవార్డు, తాజాగా జాతీయస్థాయి అవార్డు తెలంగాణ రాష్ట్రంలో అందుకున్నారు.

రసవత్తరంగా జాతీయ చెస్ చాంపియన్ షిప్

చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ బుధవారం నాలుగోరౌండ్ ముగిసే సరికి ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు, నలుగురు ఇంటర్నేషనల్ మాస్టర్లు చెరో నాలుగు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. టాప్ బోర్డులపై జీఎంలు, ఐఎంల మధ్య ఉత్కంఠభరితంగా పోటీలు జరిగాయి. మాజీ ఆసియా చాంపియన్, రెండో సీడ్ జీఎం సూర్యశేఖర్ గంగూలీ అలాగే భారత 2700 రేటింగ్ దాటిన రెండో ఆటగాడు జీఎం కృష్ణన్ శశికిరణ్‌లు ప్రతిభ చూపించారు. తమిళనాడు ఆటగాడు ఐఎం మనీష్ ఆంటో క్రిస్టియానోపై పీఎస్‌పీబీ ఆటగాడు గంగూలీ ఎక్స్ఛేంజ్ సాక్రిఫైస్ తర్వాత రూక్ త్యాగంతో ఆధిపత్యం సాధించాడు. ఆంధ్ర ఆటగాడు జీఎం ఎం.ఆర్. లలిత్ బాబు ఫ్రెంచ్ డిఫెన్స్‌లో స్థిరమైన ఆట ఆడి, అలేఖ్య ముఖర్జీపై విజయం సాధించాడు. మూడో సీడ్ జీఎం ఎస్.పి.సేతురామన్, హరియాణా ఆటగాడు ఐఎం ఆదిత్య దింగ్రా తప్పిదం వల్ల ఓటమి నుంచి తప్పించుకున్నాడు. గేమ్ డ్రాగా ముగిసింది. కేరళ ఐఎం హెచ్.గౌతమ్ కృష్ణ, గుజరాత్ ఆటగాడు ఘూదవి వీరభద్రసింగ్‌పై అద్భుతంగా ఆడాడు. రూక్ త్యాగం చేసి బ్యాక్ ర్యాంక్ చెక్‌మేట్‌తో విజయం సాధించాడు. ఇప్పటివరకు టోర్నమెంట్‌లో పొడవైన గేమ్ ఆంధ్ర ఆటగాడు ఐఎం ఎస్. రవితేజ (రైల్వేలు), గుజరాత్ ఆటగాడు జిహాన్ తేజస్ షా మధ్య సాగింది. రవితేజ 140 మూవ్‌ల తర్వాత బిషప్, నైట్ కాంబినేషన్‌తో చెక్‌మేట్ చేశాడు.


తలపడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

ప్రేమ పేరుతో మోసం

- నాలుగేళ్లుగా యువతికి ప్రేమ కబుర్లు
- యువకుడు వేరే పెళ్లికి సిద్ధమవడంతో పోలీసుస్టేషన్ మెట్లెక్కిన బాధితురాలు
- కేసు నమోదు చేసిన నరసరావుపేట పోలీసులు

నరసరావుపేట టౌన్: నేనున్నానంటూ చెప్పిన మాయ మాటలను నిజమేనని నమ్మింది. నువ్వే సర్వస్వం అంటూ చూపిన ప్రేమకు దగ్గరైంది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన ప్రమాణానికి తన సర్వసం అర్పించింది. చివరకు సదరు ప్రబుద్ధుడు వేరే పెళ్లికి సిద్ధమవుతున్నాడని తెలిసి న్యాయం చేయండి అంటూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నరసరరావుపేట పోలీసులు బుధవారం వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా సింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన యువతి, ప్రకాశం జిల్లా దొనకొండలో నాలుగేళ్ల కిందట డిగ్రీ చదివింది. ఆ సమయంలో దొనకొండకు చెందిన యండ్లూరి చినరాజుతో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఆరు నెలలుగా చినరాజు పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఓ ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో పనిచేస్తూ పల్నాడు బస్టాండ్ సమీపంలో ఓ రూం అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. అక్కడికి యువతిని అనేక సార్లు పిలిచి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా లోబరుచుకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి కోరటంతో కాలయాపన చేస్తూ వస్తున్నాడు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఈనెల 16వ తేదీన యువతి చినరాజు స్వగ్రామమైన దొనకొండకు వెళ్లి విచారించగా మరో యువతితో పెళ్లికి సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి దొనకొండ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన దొనకొండ పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతం నరసరావుపేట పరిధి కావటంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ చేసినట్లు సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు.